క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆల్విన్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. వెస్టర్న్‌హిల్స్ ఫీడర్ పరిధిలోని అడ్డగుట్ట, వెస్టర్న్ హిల్స్, ఐసీఐసీఐ బ్యాంక్ వెనుక పక్కన ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు...

◆ అదే విధంగా శ్రీరాంనగర్ ఫీడర్ పరిధిలోని శ్రీరాంనగర్, సాయి చరణ్ కాలనీ, తులసీనగర్ కమ్యూనిటీహాల్ వెనుక పక్కన ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఉదయం 9.30 గంటలకు కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శంకుస్థాపనలు చేయనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం సిబ్బంది ఓ ప్రకటనలో తెలిపింది. పర్వత్‌నగర్, జనప్రియ నగర్, తులసీనగర్ కమ్యూనిటీహాల్ వద్ద, గాయత్రినగర్ లైబ్రరీ పార్కు వద్ద సీసీరోడ్డు లేయింగ్ పనులకు శంకుస్థాపన, గాయత్రినగర్ షిర్డీ వైన్స్ వద్ద ఔట్ పోస్టు పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు, సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో అమవాస్య పూజలు



ఓల్డ్ బోయిన్‌పల్లి: అంజయ్యనగర్ రిటైల్ కూరగాయల మార్కెట్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో సోమవారం అమవాస్య పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో చండీహోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జనాభాకు అనుగుణంగా పైపులైన్ల నిర్మాణం

బాలానగర్: జేపీఆర్‌కాలనీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను సోమవారం బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభాకు అనుగుణంగా పైపులైన్ల పనులు చేపడుతున్నామని అన్నారు. నూతన పైపులైన్ల ఏర్పాటుతో సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. పైపులైన్ నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు, అసోసియేషన్ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సందడిగా ఫలహారం బండ్ల ఊరేగింపు



జయశంకర్‌నగర్‌లో ఫలహారం బండి ఊరేగింపు

ఓల్డ్ బోయిన్‌పల్లి: డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్, హస్మత్‌పేట, జయశంకర్‌నగర్ కాలనీ, బృందావన్ కాలనీ, వల్లభనగర్‌లో బోనాల జాతర ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన ఫలహార బండ్లకు కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను శాలువా కప్పి సన్మానించారు. డప్పుచప్పుళ్లకు పోతరాజుల వేసిన స్టెప్పులు ఆకట్టుకున్నాయి. భారీ తొట్టెళ్లను ఊరేగింపుగా ఆలయాలకు తీసుకెళ్లి సోమవారం రాత్రి అమ్మవారికి సమర్పించారు.

రిహాబిలిటేషన్ సెంటర్‌లో పండ్ల పంపిణీ



కూకట్‌పల్లి: మధ్యప్రదేశ్ రాష్ట్ర బీజేపీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మురళీధర్‌రావు జన్మదినం సందర్భంగా బీజేపీ నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కూకట్‌పల్లిలోని శివానంద రిహాబిలిటేషన్ సెంటర్‌లో సోమవారం మాధవరం కాంతారావు రోగులకు పండ్లు అందజేశారు. అదే విధంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 8 మందికి కోవిడ్ పరీక్షలు నిర్వహించగా అందరికీ నెగెటివ్‌గా నిర్ధారణ అయినట్టు నిర్వాహకుడు మనోహర్ తెలిపారు.

ఖాళీ ప్లాట్లతో పాట్లు..

- పెద్దఎత్తున పేరుకుపోతున్న చెత్తాచెదారం
- దోమలు, పందులకు ఆవాసాలుగా..
- అపరిశుభ్రతతో అనారోగ్య సమస్యలు
- పట్టణాలు, గ్రామాల్లో రోగాలబారిన ప్రజలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారు పురపాలికలు, గ్రామ పంచాయతీల్లోని ఖాళీ ప్లాట్లతో తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి. అందులో చెత్తా, చెదారం, మురుగు నిలిచిపోయి దోమలు విజృంభిస్తున్నాయి. అపరిశుభ్రత కారణంగా పందులు స్వైర విహారం చేస్తున్నాయి. భవిష్యత్ అవసరాలకు స్థలాలు కొనుగోలు చేసిన వారు నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా ఉంచడంతో ఈ సమస్య నెలకొంది. పురపాలిక చట్టం ప్రకారం ఖాళీ స్థలాల్లో ఎలాంటి ముళ్ల పొదలు పెరగకుండా, అపరిశుభ్రత లేకుండా చూసుకోవాలి. లేదంటే పుర అధికారులు స్థలం యజమానికి నోటీసులు ఇచ్చి శుభ్రం చేయించాలి. కానీ.. గ్రేటర్ శివారులోని మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని జీహెచ్‌ఎంసీ సర్కిళ్లతో సహా 29 పురపాలికల్లోని పలు కాలనీల్లో ఖాళీ ప్లాట్లు అపరిశుభ్రతకు నిలయంగా మారుతున్నాయి. సెమీ అర్బన్ ప్రాంతాలుగా మనుగడ సాగిస్తున్న గ్రామ పంచాయతీల్లో కూడా అదే పరిస్థితి నెలకొంది. వర్షాకాలం కావడంతో నీరు నిల్వ ఉండి దోమల స్వైరవిహారంతో జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పర్యవేక్షణ లేక..

స్థల యజమానులు తమ ప్లాట్లలో మురుగు, వర్షం నీరు నిలవకుండా, పిచ్చి మొక్కలు పెరగకుండా, ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలి. అధికారులూ దీన్ని పర్యవేక్షించాలి. కానీ కొందరు ప్లాట్లను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకొని వదిలేస్తున్నారు. ఆ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి.. చెత్తాచెదారం పేరుకుపోయి, డ్రైనేజీ నీరు చేరడంతో కొన్ని ఖాళీ ప్లాట్లు మురుగు కూపాలుగా మారుతున్నాయి. సంబంధిత యజమానులకు అధికారులు అడపాదడపా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. కొందరి వివరాలు తెలియక నోటీసులు ఇవ్వడం లేదు. వాస్తవంగా స్థలం మార్కెట్ విలువలో 0.5 శాతం ఖాళీ స్థలం పన్ను(వీఎల్‌టీ) చెల్లించాల్సి ఉంటుంది. అదీ వసూలు కావడం లేదు. అసలు పురపాలికల పరిధిలో ఎన్ని ఖాళీ స్థలాలు ఉన్నాయో కూడా సిబ్బంది దగ్గర పూర్తి వివరాలు లేవని తెలుస్తోంది.

ఖాళీ ప్లాట్లను గుర్తించి.. చర్యలు తీసుకుంటాం..

పురపాలిక పరిధిలో ఖాళీ ప్లాట్లు ఎన్ని ఉన్నాయో గుర్తిస్తాం. వాటిలో చెత్త వేయకుండా, మురుగు, వర్షం నీరు చేరకుండా.. పిచ్చి మొక్కలు తొలగించుకునేలా సంబంధిత యజమానులకు సంబంధిత కమిషనర్లు నోటీసులు జారీ చేసేలా ఆదేశాలిచ్చాం. సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపడతాం. స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి, వారి నుంచి ఖాళీ స్థలాల పన్ను వసూలు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా.

హైటెన్షన్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

- విరిగిన విద్యుత్ స్తంభం



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్–2, లాస్ట్ బస్‌స్టాప్‌లో విద్యుత్ హైటెన్షన్ స్తంభాన్ని కారు ఢీ కొట్టడంతో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. విద్యుత్ తీగలపై ఆధారపడి ఉండటంతో ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అదే రోజు సాయంత్రం విద్యుత్ సిబ్బంది ధ్వంసమైన స్తంభాన్ని మార్చేసి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు.

పార్కింగ్ చేయకుండా అడ్డుకోవాలి...

లాస్ట్ బస్‌స్టాప్ స్థలం కారు, ఆటో, లారీల పార్కింగ్‌కు అడ్డాగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. రాత్రి వేళల్లో ఇక్కడ మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు లాస్ట్ బస్‌స్టాప్‌లో పార్కింగ్ చేయకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



కారు ఢీకొట్టడంతో ధ్వంసమైన స్తంభం

బాలుడిపై వీధి కుక్కల దాడి

- చెంప, దవడ భాగానికి తీవ్ర గాయాలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి దయార్‌గూడలో వీధి కుక్కలు ఓ బాలుడిపై దాడి చేశాయి. ఆదివారం రాత్రి 8గంటలకు ఆడుకుంటున్న తొమ్మిదేళ్ల మయాంక్ (చోటూ)పై మూకుమ్మడిగా దాడి చేశాయి. ఈ దాడిలో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. చెంప, దవడ భాగానికి తీవ్రంగా గాయాలయ్యాయి. రెండేళ్లలో ఇలాంటి ఘటన జరగడం 11వ సారి అని స్థానికులు పేర్కొంటున్నారు. వీధి కుక్కలపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని పేర్కొంటున్నారు. తూతూమంత్రంగా కుక్కలను పట్టుకొని తిరిగి దయార్‌గూడలో వదిలేస్తున్నారని చెబుతున్నారు.



కుక్కల దాడిలో గాయపడ్డ మయాంక్

అంతేకాకుండా బయట కాలనీలో పట్టుకున్న కుక్కలను సైతం ఇక్కడే వదిలేస్తున్నారు. కుక్కల బెడదతో పిల్లలు, వృద్ధులు, మహిళలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కుక్కలను పట్టుకొని దూర ప్రాంతానికి తరించే విధంగా చర్యలు తీసుకోవాలని దయార్‌గూడ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆరోగ్య కేంద్రంలోని సమస్యలను పరిష్కరిస్తా



కార్పొరేటర్‌కు పీహెచ్‌సీ సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు, ఆస్పత్రి సిబ్బంది

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం కార్పొరేటర్ సబీహా బేగం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్పొరేటర్‌కు పలు సమస్యలపై పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం సభ్యులు, ఆసుపత్రి సిబ్బందితో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆస్పత్రిలో సిబ్బంది కొరత, ప్లంబింగ్, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయన్నారు. ఈ విషయాలను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాహెద్ షరీఫ్ బాబా, జ్ఞానేశ్వర్, పార్వతమ్మ, సుంకన్న, శ్రీనివాస్ యదవ్, రాము యాదవ్, కొండన్న, కోదండరాం, రాజు, వెంకటమ్మ, రేవతి, సన్నజాజుల లక్ష్మీ, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రొ.శివకుమార్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్ శివకుమార్ ప్రతిష్ఠాత్మక అవార్డుకు ఎంపికయ్యారు. ఫుల్‌బ్రైట్ నెహ్రూ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ అడ్మినిస్ట్రేటర్స్ సెమినార్ అవార్డుకు ఆయన ఎంపిక కావడం విశేషం. ప్రొఫెసర్ శివకుమార్ ఈ ఫెలోషిప్‌తో రెండువారాల పాటు సెప్టెంబర్‌లో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాను సందర్శిస్తారు. యూఎస్ క్యాంపస్‌లలో అలాగే భారతీయ ఉన్నత విద్యపై జ్ఞానాన్ని పంచుకోవడం, ఎంపిక చేసిన క్యాంపస్‌లు, సంస్థల సందర్శనలు, సమావేశాల సమయంలో పరిశోధన సహకారాలు, అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడి, విదేశాలలో అధ్యయనం తదితర అంశాలను చర్చిస్తారు. ఆయనను పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు అభినందించారు.

ఉచిత కంటి వైద్యపరీక్షలు

హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి చందానగర్‌లోని ఆరంభ టౌన్‌షిప్‌లో అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరంభ టౌన్‌షిప్‌లో పారిశుద్ధ్య కార్మికులకు సుమారు 400 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు.

మండలానికో న్యాయస్థానం ఏర్పాటు చేయాలి

లిబర్టీ: సమాజంలోని వర్గాలకు న్యాయం అందాలని హైకోర్టు సీనియర్ అడ్వకేట్ సిరివెరి శ్రీశైలం అన్నారు. అందరికీ న్యాయం పొందాలంటే ప్రతి మండలంలో ఒక న్యాయస్థానం ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోపు సంస్థలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కింద వర్గాలకు పూర్తిస్థాయిలో న్యాయం అందడం లేదని అన్నారు.హైకోర్టు సుప్రీంకోర్టు పరిధిలో లక్షల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరించాలంటే క్షేత్రస్థాయిలో కిందికోర్టులను విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నొక్కి చెప్పారు. సుప్రీం కోర్టులో ఖాళీగా ఉన్న జడ్జీల పోస్టులను హైకోర్టులో ఖాళీగా ఉన్న పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని కోరారు. న్యాయం కోసం న్యాయ స్వామ్యం రాజ్యాంగం విలువలు పడడం అన్నారు.

విద్యార్థులకు మంచి వాతావరణం, సౌకర్యాలు అవసరం



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందిస్తున్న వీసీ ఐనుల్ హసన్

- మనూ వైస్‌చాన్స్‌లర్ ప్రొ.ఐనుల్ హసన్

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయం విద్యార్థులకు అద్భుతమైన సామర్థ్యాలు ఉన్నాయని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. అమెరికాకు చెందిన సపోర్ట్ ఫర్ ఎడ్యుకేషనల్ అండ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ (సీడ్) ద్వారా రూ.73.9 లక్షల స్కాలర్‌షిప్‌లను వీసీ మంగళవారం విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వైస్‌చాన్స్‌లర్ మాట్లాడుతూ విద్యార్థులకు మంచి వాతావరణం, తగిన సౌకర్యాలు అవసరమని, తద్వారా వారు తమ సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చ న్నారు. స్కాలర్‌షిప్‌లను అందించే వారి లక్ష్యాన్ని విద్యార్థులు సాధించాలని సూచించారు. ఉర్దూ విశ్వవిద్యాలయం, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ సహకారంతో సీడ్ సంస్థ ఈ ఏడాది 586 మందికి స్కాలర్‌షిప్‌లు ఇచ్చారని తెలిపారు. 'సీడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సయ్యద్ మజహరుద్దీన్ హుస్సేని మాట్లాడుతూ విద్యకు మొదటి, ఉపాధికి రెండవ ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆత్మవిశ్వాసం, కృషి, చిత్తశుద్ధి, సమయాన్ని సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా కెరీర్‌ను మెరుగుపర్చుకోవడం, విద్యార్థుల బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ డైరెక్టర్ ముజ్తబాహసన్, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ సయ్యద్ అలీమ్ అష్రఫ్, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశం అనుసరించేలా సంక్షేమ పథకాలు

- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: యావత్ దేశం అనుసరించే విధంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ డివిజన్‌కు చెందిన 33 మందికి మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను సోమవారం ఆయన వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అన్ని వర్గాలకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు పలు కార్యక్రమాలను చేపడుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదింటి ఆడపడుచుల పెళ్లికి ఆర్థికంగా సాయం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్సే అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, నాయకులు ఖలీల్‌బేగ్, సరాఫ్ సంతోష్, ఫాజిల్, కరీంలాలా పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

నూతన కమిటీ కాలనీ అభివృద్ధికి కృషి చేయాలి



ప్రశాంత్‌నగర్‌కాలనీ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: ప్రశాంత్‌నగర్ కాలనీ నూతనంగా ఏర్పడిన అసోసియేషన్ సభ్యులు సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. ప్రశాంత్‌నగర్‌కాలనీలో నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంత్‌నగర్‌కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాలనీలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన సభ్యులు కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావును శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్ బలరాం, ఉపాధ్యక్షుడు సీవీ సోమేశ్వరరెడ్డి, జనరల్ సెక్రటరీ రాంప్రసాద్, జాయింట్ సెక్రటరీ కృష్ణారావు, కల్చర్ వీరభద్రరావు, ట్రెజరర్ ఆశీర్వాదం, ఆర్గనైజింగ్ సెక్రటరీ జానకీరాము తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న పన్నాల హరీష్‌రెడ్డి తదితరులు

బాలానగర్: స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి అన్నారు. సోమవారం బాలానగర్ డివిజన్ పరిధిలోని చరబండరాజు కాలనీ మహిళాభవన్‌లో ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో కంటి పరీక్షలతో పాటు సాధారణ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో 200 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్, వైద్యులు పాల్గొన్నారు.

కెనడా మార్కం మేయర్‌ను కలిసిన జేఎస్‌టీ శాయి



సనత్‌నగర్: కెనడా దేశం గ్రేటర్ టొరంటోలోని మార్కం నగర మేయర్ ఫ్రాంక్ స్కర్పిట్టిని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి కలిశారు. కెనడా పర్యటనకు వెళ్లిన ఆయన ఇక్కడి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యకలాపాల గురించి ఆయనకు వివరించారు. సీనియర్ సిటిజన్స్ సామాజిక సేవా కార్యక్రమాలతో కూడిన బ్రోచర్‌ను ఫ్రాంక్ స్కర్పిట్టికి చూపించి వివరించారు. అలాగే భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నగర రహదారులు, పార్కులు, శ్మశానవాటికల అభివృద్ధి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేస్తున్న అభివృద్ధి పనుల గురించి అక్కడి మేయర్‌కు వివరించినట్లు జేఎస్‌టీ శాయి తెలిపారు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్స్‌కు అందిస్తున్న సేవలు, ప్రభుత్వం తరుపున అందుతున్న రాయితీల గురించి ఆయన ఆసక్తిగా అడిగి తెలుసుకున్నట్లు శాయి పేర్కొన్నారు.

బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రి చేయాలి

లాలాపేట: తెలంగాణ రాష్ట్రంలో 2023లో అధికారంలోకి వచ్చే ఏ పార్టీ అయినా బీసీని ముఖ్యమంత్రి చేయాలని సదరన్ పొలిటికల్ అకాడమీ అధ్యక్షులు ప్రొ. గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనూ ఇప్పటి వరకు బీసీ వర్గానికి చెందిన వారు సీఎం కాకపోవడం అగ్రవర్ణాల ఆధిపత్యానికి నిదర్శనం అన్నారు. బీసీ డిక్లరేషన్, బీసీలకు అధిక సీట్లు అంశాలను పక్కకు పెట్టి త్వరలో జరుగనున్న ఎన్నికల్లో 52 శాతం జనాభా కల్గిన బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిని చేసే దిశగా అన్ని రాజకీయ పార్టీలు ఆలోచించాలన్నారు. జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ రూపకల్పన, భూమి పంపకం, రాజ్యాధికార పంపిణీ జరగాలన్నారు.

పూర్తి ఫీజును ప్రభుత్వమే చెల్లించాలి

లాలాపేట: ఇంజినీరింగ్, ఉన్నత విద్య చదివే బీసీ, ఓసీ విద్యార్థులందరికీ ర్యాంకులతో సంబంధం లేకుండా పూర్తి ఫీజును రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. ఇంజినీరింగ్, ఉన్నత విద్యా ఫీజులు భారీగా పెరిగిన నేపథ్యంలో విద్యార్థులపై ఆర్థిక భారం పడుతుందన్నారు. తెలంగాణలో బీటెక్ కనీస ఫీజు రూ. 45 వేల నుంచి గరిష్టంగా రూ 1.60 లక్షల వరకు ఉందని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేది కేవలం రూ. 35 వేలు మాత్రమే అన్నారు. ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు మాత్రం పూర్తి ఫీజును చెల్లిస్తూ బీసీ విద్యార్థుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని లేఖలో పేర్కొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై ఆందోళన చేపడతాం



టీయూడబ్ల్యూజే (ఐజేయూ) కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కూకట్‌పల్లి: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ఎప్పుడు ముందుంటుందని సంఘం రాష్ట్ర కోశాధికారి కొలను మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు అధ్యక్షతన కూకట్‌పల్లిలో కార్యవర్గ సమావేశం జరిగింది. మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ... జర్నలిస్టుల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోతె వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కూకట్‌పల్లి రాందేవ్‌రావు ఆసుపత్రిలో రాయితీ ఇచ్చినట్లు జిల్లాల్లోని ఇతర ఆసుపత్రి నిర్వాహకులతో చర్చించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు బాలరాజు మాట్లాడుతూ.. జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు రాయితీతో కూడిన విద్య అందించాలని జిల్లా విద్యాధికారితో చర్చించామన్నారు. ఇళ్ల స్థలాల సమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యేలతో వెంటనే నియోజకవర్గం కమిటీలు చొరవ చూపాలన్నారు. ఇప్పటికే జిల్లాలోని ఎమ్మెల్యేలందరిని ఒకే వేదిక మీదకు తీసుకువచ్చి జర్నలిస్టుల సమస్యలను ప్రస్తావించి పరిష్కార మార్గాలను చూపాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వెంకట్ రాంరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు, నియోజకవర్గాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

కమిటీల నియామకం....

ఐదుగురు సభ్యులతో జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అడ్‌హక్ కమిటీని నియమించారు. అందులో కూకట్‌పల్లి నుంచి దామోదర్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ లక్ష్మణ్, ఉప్పల్ హరీష్, మల్కాజ్‌గిరి పవన్, మేడ్చల్ రాజేష్‌లు నియమితులయ్యారు.